క్లుప్తంగా

హాస్టల్ విద్యార్థులకు మెటీరియల్ అందజేత



విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందిస్తున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు: స్థానిక ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు ఎంపీడీవో వీ జ్యోతి సోమవారం పెన్నులు, ప్యాడ్లు, ఇతర సామగ్రి అందజేశారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించగా, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శేషుబాబు, డాక్టర్ నవ్యారెడ్డి

కొత్తపట్నం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో యు.శేషుబాబు, ఈతముక్కల పీహెచ్‌సీ డాక్టర్ నవ్యారెడ్డి సూచించారు. ఈతముక్కల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం యానాది కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ సిబ్బంది వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజలు తినే ఆహారం, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని కోరారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినకూడదన్నారు. వాటివలన అనేక వ్యాధుల వస్తాయని తెలిపారు. ఆరోగ్య సమస్యలుంటే దగ్గరలోని పీహెచ్‌సీలో చూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి శ్రీనాథ్, సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిని పారదోలుదాం

- గాలికుంటు వ్యాధికి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన పశుసంవర్ధకశాఖ జేడీ రవి



మద్దిపాడులో దూడలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవి, డీడీ జగత్ శ్రీనివాసరావు, ఏడీ కిషోర్‌కుమార్ తదితరులు

మద్దిపాడు: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా పారదోలుదామని పశుసంవర్ధక శాఖ జేడీ వి.రవి పిలుపునిచ్చారు. సోమవారం మద్దిపాడులో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా సంవత్సరానికి రెండుసార్లు ప్రభుత్వమే ఉచితంగా టీకాలు అందిస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఒంగోలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.జగత్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ వ్యాధి వైరస్ వలన సంక్రమిస్తుందని, ఈ వ్యాధి సోకడం వలన మగ పశువులలో పని చేసే సామర్థ్యం తగ్గిపోతుందని, ఆడ పశువులలో ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందని వివరించారు. చూడి పశువులు ఈసుకుపోతాయని, చిన్న దూడలు చనిపోతాయని తెలిపారు. పశుసంవర్ధకశాఖ మద్దిపాడు ఏడీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ మద్దిపాడు మండలంలో తెల్లపశువులు 1250, నల్ల పశువులు 8999 ఉన్నాయన్నారు. పశుపోషకులు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని, లేకపోతే పాలదిగుబడి తగ్గి ఆర్థికంగా పశుపోషకులు నష్టపోతారని తెలిపారు. మండలంలో పశువైద్యశాఖ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం మండల కేంద్రమైన మద్దిపాడుతో సహా దొడ్డవరప్పాడు గ్రామంలో కూడా టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.హర్ష్మశ్రీ, పశువైద్య సహాయకులు, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ప్రశాంత్‌జోషి, విద్యార్థులు



ఇంజినీర్స్ డేలో పాల్గొన్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు సిటీ: భారతజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఇంజినీర్, ప్రపంచ ప్రసిద్ధి కట్టడాల రూపశిల్పి, అద్భుత ఆనకట్టలు, వంతెనలు, రహదారుల నిర్మాత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డేని సోమవారం ఘనంగా నిర్వహించారు. డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ జోషి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఐడియాథాన్ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 60 సరికొత్త ఐడియాలు, ప్రాజెక్ట్‌లతో విద్యార్థులు ఐడియాథాన్‌లో పోటీపడ్డారు. విద్యార్థుల ఐడియాలను పరిశీలించిన ఒంగోలుకు చెందిన జాజీ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు, ప్రోటోటైప్‌లను పరిశీలించి వారికి బహుమతులు అందజేశారు. ఈ ఐడియాథాన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్విస్ విజార్డ్స్ తేజస్విని టీమ్‌కి మొదటి బహుమతి, బీ సాల్వ్ పి.మహీంద్ర టీమ్‌కి రెండో బహుమతి, సైబర్ షీల్డ్ ఎస్‌కే ఇమ్రాన్ టీమ్‌కి మూడో బహుమతి అందజేశారు. ఈ ఐడియాథాన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్‌కి పంపించనున్నట్లు డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు తెలిపారు. క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రాజెక్ట్‌లకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, దాని ద్వారా విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపడతాయని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి అన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, డీన్‌లు, డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సీఎస్‌సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్ అండ్ టీమ్ పర్యవేక్షించారు.

వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో...

ఒంగోలు మెట్రో: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఇంజినీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు నేతృత్వంలో ప్రముఖ ఇంజినీర్ మునగ తిరుమలను సత్కరించారు. వాసవీ క్లబ్స్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి బ్రహ్మానందం, కార్యదర్శి మద్దాలి శివప్రసాద్, కోశాధికారి బియ్యపు సంపత్ కుమార్, రాధా రమణ గుప్తా జంధ్యం, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏకేయూ మైగ్రేషన్, ప్రొవిజినల్ సర్టిఫికెట్లు విడుదల



మైగ్రేషన్ పుస్తకాన్ని అందజేస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో చేరి రెండు సంవత్సరాల పీజీ, బీఎడ్, బీపీఎడ్, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన మైగ్రేషన్ సర్టిఫికెట్లు, బీఎడ్ పాసైన విద్యార్థుల ప్రొవిజినల్ సర్టిఫికెట్లను సోమవారం వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మూర్తి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో గుర్తింపు పొందిన కళాశాలల్లో చదివి అత్యుత్తమ మార్కులతో పాసై ప్రొవిషనల్ సర్టిఫికెట్ పొందుతున్న విద్యార్థులను అభినందించారు. మొదటి బ్యాచ్ విద్యార్థులు భవిష్యత్‌లో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అదే సమయంలో ఆంధ్రకేసరి యూనివర్సిటీకి సంబంధించి మొదటి మైగ్రేషన్ పుస్తకాన్ని వివేకానంద బి.ఎడ్ కళాశాల చైర్మన్, అనిబిసెంట్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, కందుకూరు సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ దివి రమేష్‌లు ఏకేయూ వీసీ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలాదేవి, సీఈ ప్రొఫెసర్ గోదేశి సోమశేఖర, సీఈ డాక్టర్ ఏ భారతీదేవి, నాన్ కాన్ఫిడెన్షియల్ విభాగం పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్, పరీక్ష విభాగం ఉద్యోగులు సూడా శివరామ్, మేకా ప్రకాష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ మధ్య అవగాహన ఒప్పందం...

ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ కళాశాలల్లో విద్యార్థులకు మూక్స్, స్కిల్ డెవలప్మెంట్ తదితర విషయాలలో అవసరమైన మెళకువలు, విజ్ఞానాన్ని అందించడంతో పాటు మూక్స్ తయారు చేసి ఇచ్చేందుకు సోమవారం ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఉన్నతాధికారులకు, స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ ప్రతినిధులకు మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు వీసీ మూర్తి తెలిపారు. రిజిస్ట్రార్ హరిబాబు, స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున ఆ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఏసీఈ డాక్టర్ అంచుల భారతీదేవి, ఏసీఈ సహాయకుడు డాక్టర్ ఎన్.సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొత్తపట్నం మండల సర్వసభ్య సమావేశం

కొత్తపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో యు.శేషుబాబు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. దీంతో పాటు ఫంక్షన్ కమిటీ సమావేశం కూడా జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. హాజరు కాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అల్లూరులో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సార్డ్స్ కో ఆర్డినేటర్ సుమన్

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటి వలన ఎన్నో అనర్థాలున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ వై.సుమన్ సూచించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న కళామందిర్‌లో ఆలయానికి వస్తున్న పూజార్లు, భక్తులు, గ్రామస్తులకు సోమవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఆలయంలో అర్చకులుగా పనిచేస్తూ పూజలు చేస్తున్న పురోహితులు ఆలయానికి వస్తున్న భక్తులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. పురోహితులు చెబితే భక్తిగా కచ్చితంగా వింటారన్నారు. అందువలనే పూజార్లు, భక్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. బాల్య వివాహాలు 2006 చట్టాల గురించి వివరించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. బాల్య వివాహాలతో అనారోగ్యం పాలవుతారన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే సార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఒంగోలు బాలల కమిటీ సభ్యులు, సార్డ్స్ సిబ్బంది శ్రీనివాసులు, సోషల్ వర్కర్ ఎస్.బాలకాశమ్మ, మహిళా పోలీస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధులపై అప్రమత్తత అవసరం



దూడలకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సంతనూతలపాడు, పేర్నమిట్ట పశువైద్యాధికారులు అనురాధ, చిరంజీవి సూచించారు. సోమవారం మండలంలోని మద్దులూరు, మాచవరం, ఎండ్లూరు, రుద్రవరం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి చిరంజీవి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పశువులకు జబ్బు చేస్తే పశువైద్య సిబ్బందిని సంప్రదించి తగిన మందులు వాడాలని సూచించారు. నాలుగు గ్రామాల్లో 525 పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేశారు. ఆయా గ్రామాల్లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పశువైద్య శిబిరం నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



రణభేరి వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తపట్నం: మండలంలోని గమళ్లపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శెట్టి రవి ఆధ్వర్యంలో రణభేరి వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బైకు జాతర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఒంగోలు నుంచి మొదలయ్యే బైక్ ర్యాలీ కార్యక్రమానికి మండలం నుంచి ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు వెంటనే ఇవ్వాలని, బోధనేతర పనులకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్‌వీ కొండారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉమామహేశ్వరరావు, జయరామిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు, ప్రజలు

చీమకుర్తి రూరల్: మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో ఉన్న సామాజిక భవనం ప్రాంగణంలో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సూచించిన మార్గం అనుసరణీయమని అన్నారు. ఆయన బాటలో అందరూ నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వేమా చిన కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోటయ్య, పి.పేరయ్య, సురేష్, వేమా ఎలమందయ్య, బాలకోటేశ్వరరావు, పి.ప్రభాకర్, బి.కొండలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్ తయారీ ముఖ్యం

ఒంగోలు సబర్బన్: జిల్లాలో వర్మీకంపోస్ట్ తయారీ లక్ష్యంగా గ్రామ పంచాయతీ పాలకమండళ్లు, అధికారులు ముందుకు సాగాలని జేసీ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని మీ కోసం భవన్‌లో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఒంగోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో తయారైన వర్మీ కంపోస్టును సోమవారం ప్రదర్శించి విక్రయించారు. ఈ కార్యక్రమంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) సుశీల, రెవెన్యూ అధికారి ఓబులేష్, ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం



వినాయకుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు సిటీ: నగరంలోని కుట్టుబోయినపాలెంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. వైఎస్సార్ సీపీ 22వ డివిజన్ అధ్యక్షుడు కుట్టుబోయిన ఖాశీయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కుట్టుబోయిన కోటి యాదవ్, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం శేషగిరి యాదవ్, ఐదో డివిజన్ నాయకుడు తుమ్మకూరు హనుమంతరావు, కుట్టుబోయిన వెంకటసుబ్బయ్య, పల్నాటి విష్ణు, ఆవుల మహేష్, గుమ్మడి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి

ఒంగోలు టౌన్: ఆరు నెలల్లోగా టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తామని, బ్యాంకులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ లబ్ధిదారులకు ఇచ్చిన హామీ నిలుపుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేర్చాలంటే 180 కోట్ల రూపాయలు అవసరమవుతాయని, వెంటనే నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టిడ్కోలో కట్టిన కట్టడాలు ప్రమాదకరంగా ఉన్నాయని, నీరు, రోడ్లు, డ్రైనేజీ, కరెంటు సదుపాయాలు లేకపోవడంతో భయంకరంగా ఉందని అన్నారు. చిల్లచెట్లు విపరీతంగా పెరిగిపోయి పాములు తిరుగుతున్నాయని, టిడ్కో పరిసరాలు అడవిని తలపిస్తున్నాయని తెలిపారు. అగ్రహారం వద్ద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసి లబ్ధిదారులందరికి తలా 2 సెంట్లు పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. శివారు కాలనీలకు మూడు రోజులకోసారి కూడా నీరు సరఫరా చేయలేని దుస్థితి నెలకొందని తెలిపారు. నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అరికట్టాలని డిమాండ్ చేశారు. నగర ప్రజల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సేకరించి పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీఎస్ సీఐ జగదీష్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజల తరలి వచ్చి నేరుగా జిల్లా పోలీసు అధికారులను కలిసి ఫిర్యాదులు అందజేశారు. తమ సమస్యలను విన్నవించుకున్నారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌లో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, సీఐ సుధాకర్, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ దుర్గా ప్రసాద్, సీసీఎస్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలపై ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు.